ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

చేవెళ్ల టౌన్: ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ

చేవెళ్లటౌన్, డిసెంబర్ 30: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి చేవెళ్ల డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల నుంచి మొత్తం25 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా చేవెళ్ల ఆర్డీవో మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపి పరిశీలించిన వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. ధరణి సమస్యకు సంబంధించి 15, రుణమాఫీ కాలేదని ఒకటి, పింఛన్ రావడం లేదని 7, గృహ జ్యోతికి సంబంధించి ఒకటి, అగ్రి కల్చర్‌కు సంబంధించి 1 మొత్తం 25 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రతి సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సంధ్య, ఇస్మాయిల్, ఆపరేటర్ సర్దార్, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నంరూరల్ : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి ఆదేశించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలు పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అనంతరెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి

సహదేవి సముద్రం చెరువును సుందరీకరణ చేయాలి



ఎంపీడీవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, డిసెంబర్ 30: తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని సహదేవి సముద్రం చెరువును సుందరీకరణ చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీవో శ్రీకాంత్‌కు బీజేపీ నాయకులు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే రెండవ అతి పెద్ద చెరువుగా పేరుగాంచిన, సహదేవి సముద్రం చెరువును పట్టించుకునే వారే కరువయ్యారని తెలిపారు. అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో చెరువు కట్టపై తుమ్మ చెట్లతోపాటు కలుపు మొక్కలు ఏపుగా పెరిగాయని తెలిపారు. చెట్లు పెద్దవి కావడంతో చెరువు కట్ట దెబ్బతినే ప్రమాదం ఉన్నదన్నారు. వెంటనే అధికారులు చెట్లను తొలగించి చెరువును సుందరీకరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

చెరువు కట్టపై కలుపు మొక్కల తొలగింపు

కట్ట మీద కలుపు మొక్కలను తొలగిస్తున్న గ్రామ పెద్దలు

మొయినాబాద్, డిసెంబర్ 30 : కట్టమైసమ్మ కట్టకు ఇరువైపులా ఉన్న కలుపు మొక్కలు తొలగించడానికి యువకులు నడం బిగించారు. మండల పరిధిలోని సురంగల్ గ్రామంలోని పెద్ద చెరువు మీద ఉన్న కట్టమైసమ్మ ఆలయం సమీపంలో చెరువు కట్ట మీద ఇరువైపులా ఉన్న కలుపు మొక్కలను గుమ్మల్ల సీతారాంరెడ్డి, బొర్ర జనగ్ స్వచ్ఛంధంగా ముందుకొచ్చి తొలగించారు. చెరువు కట్టకు మొరం పోసి వెడల్పు పనులు చేపట్టారు. కార్యక్రమంలో యువకులు సీతారాంరెడ్డి, జగన్, గౌతంరెడ్డి, ప్రభుయాదవ్, నారాయణరెడ్డి, మహేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి మైసయ్య, బాల్‌రాజ్, శంభుయాదవ్, సాయియాదవ్, మధుసూదన్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకే టాలెంట్ టెస్ట్

మంచాల, డిసెంబర్ 30: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికే టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు మంచాల బాలుర పాఠశాల ఆవరణలో సాంఘిక శాస్త్రంపై టాలెంట్ టెస్ట్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. వీరిలో అఖిలేష్, తరుణ్, శ్రీవాని, అంజలి, శ్రీశైలం, యశ్వంత్, సాయి, చరణ్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘికశాస్త్రం మండల కన్వీనర్ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు తిరుపతి, శ్రీనివాస్, వెంకటనర్సయ్య, గోపాల్, అనిత, అనురాధ, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

విరాళం అందజేస్తున్న అనంత్‌రెడ్డి

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 30 : చేవెళ్ల మండల పరిధి తంగడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి సోమవారం రూ.51వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట స్థానిక నేతలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న స్థానికులు

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 30 : శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి 1,9,10 వార్డుల పరిధిలో రెండు వరుసల రోడ్డు వాగు వరకు వేసి వదిలేశారు. అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సోమవారం వార్డులకు సంబంధించిన ప్రజలు, స్థానిక నేతలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసంపూర్తి రోడ్డు నిర్మాణంతో అవస్థలు పడుతున్నామని, అధికారులు, ప్రభుత్వం స్పందించి త్వరగా పనులు ప్రారంభించాలని కోరారు.

అక్రమ మట్టి వ్యాపారంపై చర్యలు తీసుకుంటాం

షాద్‌నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత

షాద్‌నగర్, డిసెంబర్30: కేశంపేట మండలం సంగెం గ్రామంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అక్రమ మట్టి వ్యాపారంపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఆర్డీవో ఎన్ఆర్ సరిత సోమవారం తెలిపారు. సంగెం గ్రామ రెవెన్యూ పరిధిలోని లింగన్నపలుగుట్ట సమీపంలో సర్వే నంబర్ 220లో అసైన్డ్ భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత మండల తహసీల్దార్‌కు అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యవహారంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసే విధంగా చర్యలు ఉంటాయని, మండల తహసీల్దార్ నుంచి పూర్తి సమాచారం రాగానే శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇదిఇలా ఉంటే గత కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న విషయాన్ని మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి అక్రమ మట్టి వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, హెచ్ఎం గోవింద్

షాబాద్, డిసెంబర్ 30: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదుగాలని షాబాద్ మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాంఘికశాస్త్ర మండల స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ... మండల స్థాయిలో సాంఘిక శాస్త్ర ప్రతిభా పోటీల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో మనిషా, అర్చన, శ్రీతేజ, వర్ష, రెండవ స్థానంలో శ్రావణి, వర్ష, మహేశ్వరి, భవాని, మూడవ స్థానంలో సంజన, సాయిశ్రీ, ధనుశ్రీ, శివకుమార్ తదితరులు ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. విద్యార్థుల్లో మేధా శక్తిని పెంపొందించేందుకు ఈ ప్రతిభా పోటీలు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం గోవింద్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కేసులే

బడంగ్‌పేట, డిసెంబర్ 30: నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట సీఐ నాగరాజు హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు కూడా రోడ్ల పై కేక్‌లు కట్ చేయడం, వాహనాలు రోడ్ల పై పార్కింగ్ చేయడం నేరం అవుతుందన్నారు. ఇతరులకు ఇబ్బంది కల్గించే పనిచేయకూడదన్నారు. అన్ని కాలనీలలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం అర్ధరాత్రి వరకు రెస్టారెంట్లు, హోటల్స్ ఉంటాయన్నారు. ఒంటి గంట తర్వాత మూసివేయాలన్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కాకతీయుల ఆనవాళ్లను పరిరక్షించాలి

నందిగామ, డిసెంబర్30: కొత్తూరు మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయ పరిసరాల్లో బయటపడిన కాకతీయుల కాలపు క్రీ.శ.13వ శతాబ్దం నాటి శివలింగం, నంది శిల్పాలను పరిరక్షించాలని, పొలాల్లో గట్ల నడుమ పూడుకపోయిన కాకతీయ కాలంనాటి నంది విగ్రహాన్ని కూడా బయటకు తీసి ఆంజనేయ స్వామి దేవాలయంలో పెట్టాలని పురావస్తు పరిశోధకులు శివనాగిరెడ్డి సూచించారు.

పురాతన విగ్రహాలను పరిశీలించిన పురావస్తు పరిశోధకులు శివనాగిరెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆమనగల్లు, డిసెంబర్ 30: డిసెంబర్ 31 వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ప్రజలు పోలీసుల సూచనలు పాటించలన్నారు. వైన్ షాప్స్, బార్స్, రెస్టారెంట్స్ యజమానులు ప్రభుత్వం అనుమతించిన సమయపాలన పాటించాలన్నారు. రాత్రి 10 గంటల నుంచి స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తామని, మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధిస్తామన్నారు. పటాకులు, డీజేలు నిషేధమని ఆయన తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలుంటాయని సీఐ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎటువంటి వేడుకలు నిర్వహించినా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చేవెళ్లటౌన్ : నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ఏసీపీ కిషన్, చేవెళ్ల డివిజన్ ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనే వారు జాగ్రత్తలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. న్యూ ఇయర్ ఆఫర్ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నదని, ఆన్‌లైన్లో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయకూడదన్నారు.

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి

కడ్తాల్ : నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సీఐ శివప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 31 రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవాలని తెలిపారు. రోడ్లపై పెద్ద పెద్ద సౌండ్స్‌తో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని పేర్కొన్నారు. రెస్టారెంట్లు, ఫాంహౌస్‌లు, ఫంక్షన్‌హాల్స్‌లో వేడుకలను జరుపుకునేందుకు, వాటి యజమానులు ముందుస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. బార్లు, వైన్స్ షాపులు 11 గంటలు, దుకాణాలు, హోటళ్లను 12 గంటల తర్వాత మూసివేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, రాత్రి సమయంలో గుంపులుగా తిరిగే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధితుడితో మాట్లాడుతున్న ఎంపీడీవో

కడ్తాల్, డిసెంబర్ 30: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన రేపని మల్లేశ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో సుజాత సోమవారం మధ్యాహ్నం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బాధితుడిని పరామర్శించారు. కుటుంబ పోషణ భారమైందని, తనకి పింఛన్‌ను అందజేయాలని కుటుంబ సభ్యులు ఎంపీడీవోను కోరారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో మల్లేశ్‌కు సదరం సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. మండలంలో కదల్లేని స్థితిలో ఉన్న వారందరికీ సదరం సర్టిఫికెట్ అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీచ్యా నాయక్, జహంగీర్‌బాబా, మల్లేశ్‌గౌడ్, నర్సింహా, రాజేశ్, రవి, భానుకిరణ్, శ్రీకాంత్, విజయ్, మనీశ్‌రెడ్డి, సత్యం, రాజు, రమేశ్, నరేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆనంద్, లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, డిసెంబర్ 30: మండల కేంద్రానికి చెందిన రాయికంటి సాలమ్మ మూడు రోజుల క్రితం మృతి చెందింది. సోమవారం సాయంత్రం బాధిత కుటుంబాన్ని మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుడికి ఆనంద్, లక్ష్మీనర్సింహారెడ్డి ఐదు వేల చొప్పున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వీరి వెంట బీఆర్ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు రామచంద్రయ్య, భిక్షపతి, చెన్నయ్య, సురేశ్, రమేశ్, శ్రీరాములు, యాదయ్య, కరుణాకార్, రాఘవ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఆమనగల్లు, డిసెంబర్30 : జిల్లా పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న దళిత ప్రధానోపాధ్యాయుడైన కంబాలపల్లి రాములుపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డీఎస్పీ జిల్లా ఉప అధ్యక్షుడు వంకేశ్వరం రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ ఈ సంఘటనపై రాచకొండ సీపీ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో డీఎస్పీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ నాయకులు ప్రవీణ్, హరికృష్ణ, శ్రీనూయాదవ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్

రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబర్ 30 : హైకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా తమ భూమిలో నుంచి రోడ్డు నిర్మాణానికి జాతీయ రహదారులు, ఆర్ అండ్‌బీ అధికారులు యత్నిస్తున్నారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాటసింగారం రెవెన్యూ పరిధి సర్వేనం 341లో విజయవాడ జాతీయ రహదారికి ఆనుకొని 0.35 గుంటల భూమిని ఇనాంగూడ గ్రామానికి చెందిన బాత్కుల శ్రీనివాస్‌గౌడ్ తండ్రి 1954లో కొనుగోలు చేయగా, అప్పటి నుంచి తమ కుటుంబం స్వాధీనంలో ఉందని బాధితుడు తెలిపారు. గత 70 ఏండ్లుగా అనుభవిస్తున్న భూమిలో నుంచి తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రాత్రి సమయాల్లో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు యత్నిస్తున్న జాతీయ రహదారి అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిర్యాదును స్వీకరించమంటూ చేతులెత్తేశారని బాధితుడు వాపోతున్నాడు. గత ఏడాది న్నర కాలంగా జరుగుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇటీవల తమకు ఎలాంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండా అక్రమంగా తమ భూమిలోకి అధికారులు, కాంట్రాక్టర్లు ప్రవేశించి కాంక్రీట్ కంకర వేశారని, ఇదేమిటని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాడు. తమ భూమిలో ఎలాంటి రోడ్డు నిర్మాణం చేపట్టరాదని హైకోర్టు నుంచి ఉత్తర్వులు పొంది ఉన్నామని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా రాత్రి సమయంలో అక్రమంగా తమ భూమిలోకి చొరబడి రోడ్డు నిర్మాణం కోసం కాంక్రీట్ కంకర వేశారని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయకుండ, తమకు ఎలాంటి నోటీసులు, నష్టపరిహారం ఇవ్వకుండా దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్ పై, సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారుల పై న్యాయ పోరాటం చేస్తానని బాధితుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

భూ యజమానికి నోటీసులు ఇవ్వకుండా రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

హైకోర్టు ఉత్తర్వులను చూపిస్తున్న బాధితుడు శ్రీనివాస్‌గౌడ్



మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి పరామర్శ

కడ్తాల్, డిసెంబర్ 30: నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి జంగారెడ్డి పది రోజుల క్రితం మరణించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే స్వగ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో... ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మిషన్ భగీరథ్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించి, మర్రి జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మలశ్రీ శైలంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సైదులు, నరేశ్‌గౌడ్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న నల్లచెరువు గ్రామస్తులు

మాడ్గుల, డిసెంబర్30: మండల పరిధిలోని నల్లచెరువు గ్రామానికి చెందిన రైతులు సోమవారం తహసీల్దార్ వినయ్ సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇర్విన్ శివారులో సర్వే నెంబర్ 99 శిల్లింగ్ పట్టా భూమిలు నిరుపేద దళితులకు ప్రభుత్వం ఇచ్చింది. వాటిని రైతులు పశువుల, మేకల, గొర్రెల మేపకానికి వాడేవారు. నల్లచెరువు గ్రామానికి చెందిన ఓ భూస్వామి 99 సర్వే నెంబర్‌లో నాకు పట్టా భూమి కలదు అంటు దళితులకు కేటాయించిన భూమిని కబ్జా చేస్తున్నాడు వారి నుండి శిల్లింగ్ పట్టా భూమిని కాపాడాలంటూ తహసీల్దార్‌ను గ్రామ ప్రజలు కోరారు. తహసీల్దార్ వెంటనే స్పందించి పనులు నిలిపివేశారు. కార్యక్రమంలోని కట్ట అంజయ్య, జంగయ్య, అనుమంతు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

బూత్ అధ్యక్షుల ఎన్నిక

బూత్ అధ్యక్షులను సన్మానించిన నాయకులు

తుర్కయాంజాల్, డిసెంబర్ 30 : భారతీయ జనతా పార్టీ తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి ఉమర్‌ఖాన్‌గూడ, సంఘీనగర్ బూత్ అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి, శివగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి ఉమర్‌ఖాన్‌గూడలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకుడు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకుడు బల దేవరెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

మంచాల, డిసెంబర్ 30 : కడుపునొప్పి భరించలేక మహిళ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం ఎస్సై లాలయ్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని తాళ్లపల్లిగూడ గ్రామానికి చెందిన రమేశ్‌తో రెండు నెలల క్రితం యాచారం మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన అమీర్‌పేట మనీషకు (21) వివాహం జరిగింది. మనీష నిత్యం కడుపు నొప్పితో బాధపడేదని, దీంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. మనీష మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవాఖానకు తరలించి అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్కూటీ ఢీకొని వ్యక్తి మృతి

ఆదిబట్ల, డిసెంబర్ 30: స్కూటీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం నేపాల్‌కు చెందిన గోవింద సాయి (60) తన కొడుకు శ్రీతేజ్‌కుమార్ సాయితో కలిసి భారతదేశానికి వలస వచ్చి మన్నెగూడలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మన్నెగూడ వద్ద దుర్గా వైన్స్ షాప్ వద్ద రోడ్డు దాటుతుండగా బొంగుళూరు నుంచి బియన్‌రెడ్డి వైపు వేగంగా ఓ స్కూటీ వచ్చి గోవిందసాయిని ఢీ కొట్టింది. దీంతో గోవిందసాయి కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించారు. దీంతో అప్పటికే డాక్టర్లు మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు తేజ్‌కుమార్‌సాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

క్రేన్‌కు తాకి మరొకరు..

ఆదిబట్ల, డిసెంబర్ 30: నడుచుకుంటు వెళుతూ ఓ వ్యక్తి క్రేనుకు తాకి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం ఆమనగల్లు మండలం, సింగంపల్లి గ్రామానికి చెందిన బండారి జంగయ్య (53) రాగన్నగూడ జీవీఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి రాగన్నగూడ నాగార్జున సాగర్ హైవేపై నడుచుకుంటూ